క్లుప్తంగా

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



షిర్డీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కర్నూలు రహదారిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో జ్యేష్టమాస గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కృపాధామ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో బాబాకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు సద్వినియోగం చేసుకోవాలని జీకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానందఆచారి అన్నారు. గురువారం మండలంలోని రామతీర్థం ప్రాథమిక పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. 'బడిలో చేర్పిద్దాం' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని బ్రహ్మానంద ఆచారి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు,ఉపాధ్యాయులు మధనగోపాల్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఎంఈజీ రుణాలు మంజూరు చేయాలి

కోవెలకుంట్ల: అర్హులందరికీ పీఎంఈజీ రుణాలు మంజూరు చేయాలని మాలమహానాడు జిల్లా నాయకులు పెరుమాళ్ల రాముడు, మద్దిలేటి, ఇవ్వాశాస్త్రి డిమాండ్ చేశారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కోవెలకుంట్ల బ్రాంచ్ ఎదుట గురువా రం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూ రు చేసిన రుణాలు ఇవ్వకుండా బ్యాంకు అధికా రులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు.అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, రాములమ్మ, ఈశ్వరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

జలవనరులను సంరక్షించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్యాపిలి: జలవనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ సాయి మనోహర్ అన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ సృష్టిలో మానవాళితో పాటు అన్ని రకాల జీవుల మనుగడకు నీరే ప్రధానం అన్నారు. అయితే భవిష్యత్తులో నీటి ఇక్కట్లు రాకుండా ఉండాలంటే ఇప్పటి నుంచి ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భూగర్భ జలాల పెంపునకు అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సచివాలయంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయ ఉద్యాన శాఖ అధికారి రాజు నాయక్, రఘువరన్ ఆధ్వర్యంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ నంద్యాల జిల్లా మేనేజర్ మహదేవయ్య రైతులకు ఆయిల్ పామ్ సాగు, సబ్సిడీ వివరాలను రైతులకు వివరించారు. ఎకరాకు 57 మొక్కల చొప్పున పతంజలి కంపెనీ ద్వారా నాణ్యమైన మొక్కలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.10,500 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలవరకు అందజేస్తామన్నారు. ఈ మొక్క ఒక్కసారి నాటుకుంటే 30 సంవత్సరాల వరకు ఉంటుందని, ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు.

రైతులను ఆదుకోవాలి

డోన్ రూరల్ : 2023-2024 సంవత్సరం రబీ సీజన్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్, ప్యాపిలి మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. అప్పులు చేసి పంటలు వేసి నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందానికి డోన్, ప్యాపిలి మండలాల రైతులు నష్టపోయిన విషయాన్ని అధికారులు వివరించి ఆదుకోవాలని కోరారు.

ఆకట్టుకుంటున్న 'దేవరకోన'



కొండ దిగువన వేంకటేశ్వరస్వామి ఆలయం



ప్రవహిస్తున్న జలధారలు



పరవళ్లు తొక్కుతున్న జలపాతం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంట సమీపంలో వెలసిన పురాతన దేవరకోన పుణ్యక్షేత్రం భక్తులు, పర్యాటకులను ఆకట్టుకుంటుంది. గ్రామానికి అతి సమీపంలో వెలసిన దేవరకోన ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం అబ్బురపరుస్తుంది. రెండు కొండల మధ్య ఎత్తైన ప్రదేశం నుంచి జలపాతం పరవళ్లు తొక్కుతు కిందకు ప్రవహిస్తుంటాయి. పచ్చని చెట్లు, పక్షుల కిలకిల పలుకులు మనసును కట్టిపడేస్తున్నాయి. రెండు కొండల మధ్య ఏర్పడిన పాయలో గలగలపారే జలధారలు చూడముచ్చటగా ఉంటాయి. నీటి తుంపరలు తాకగానే మనసు పులకిస్తుంది. జలపాతం చెంతనే కొండ అడుగు భాగంలో వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్నాడు. స్వామి విగ్రహం ఇక్కడే లభించడంతో ప్రతిష్టించినట్లు పెద్దలు పేర్కొన్నారు. గతంలో తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లలేని వృద్ధులు ఇక్కడే కొలువైన స్వామిని దర్శించుకునేవారని పెద్దల సమాచారం. ఆలయ ఆవరణలో వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకుంటుంటారు. జలపాతం ఉండటంతో పర్యాటక కేంద్రంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి జలపాత దృశ్యాలను తిలకించేందుకు ఇక్కడికి వస్తుంటారు. కార్తీక మాసంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కార్తీక స్నానాలు ఆచరించడంతో పాటు వనభోజనాలు పెద్ద ఎత్తున చేసుకుంటు ఉంటారు. పురాతన దేవరకోన పుణ్యక్షేత్రం ఆహ్లాదానికి కేంద్రంగా మారింది. దేవరకొన అందాలు తలకించేందుకు మండల ప్రజలకాదు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, పకృతి ప్రేముకులు తరలివస్తుంటారు.

పాత కక్షలతో ఇంటిపై దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు, బైకు, ఇంటి అద్దాలు ధ్వంసం
- ఎనిమిది మందిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన యువకుడు అరుణ్ కుమార్, తండ్రి రాజశేఖర్

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న దత్తనగర్‌లో పాత కక్షల నేపథ్యంలో దాడి జరిగింది. గురువారం జరిగిన ఈ ఘటనలో రాజశేఖర్‌తోపాటు అతని కుమారుడు అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దత్త నగర్‌లోనివాసం ఉంటూ జాతీయ రహదారిపై హోటల్ నడుపుతున్న ఉడుములపాడు గ్రామానికి చెందిన ఈడిగ కృష్ణమూర్తి, ఇదే గ్రామానికి చెందిన రాజశేఖర్ కుమారుడైన అరుణ్‌కుమార్‌తో గతంలో పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా ఇల్లు వదిలివెళ్లిన పోయిన అరుణ్ తిరిగి రావడంతో గమనించిన కృష్ణమూర్తి ఇది జీర్ణించుకోలేకపోయారు. బంధువులతో కలిసి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌తోపాటు అతని కుమారుడు అరుణ్‌కుమార్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఇంటి అద్దాలు, బైకు ధ్వంసం అయ్యాయి. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తరలించారు. బాధితుడు అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కృష్ణమూర్తి, మహేష్, సుబ్బయ్యతోపాటు మరో ఐదు మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



ప్రయాణికులతో డిప్ తీయిస్తున్న డీఎం శశిభూషణ్

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో భద్రతతో పాటు సురక్షిత ప్రయాణం ఉంటుందని ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. ప్రయాణికులను ప్రోత్సహించేందుకు ప్రవేశ పెట్టిన లక్కీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు గురువారం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల చేత డిప్ తీయించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్-కర్నూలు మధ్య పల్లె వెలుగు ప్రయాణికులు దిగిపోయే సమయంలో బస్సులో ఏర్పాటు చేసిన లక్కీ డిప్ బాక్స్‌లో టిక్కెట్ వెనుక పేరు, సెల్ నంబరు రాసి వేయాలన్నారు. నెలలో రెండు పర్యాయాలు 15రోజులకు ఒకసారి లక్కీడిప్ తీసి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని పల్లెవెలుగు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్1 నుంచి 15వ తేదీ వరకు డిప్ తీయగా మొదటి స్థానంలో కర్నూలుకు చెందిన అల్లీపీరా, రెండ విజేతగా తొలిశాపురానికి చెందిన మధు, మూడవ బహుమతి డోన్‌కు చెందిన నాగలక్ష్మి గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోజీద్, సిబ్బంది,ప్రయాణీకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

డోన్ టౌన్ : జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి గురువారం అడ్మిషన్ల పక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. మొదటి రోజు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ ఆధారంగా 1 నుండి 281 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 52 మంది హాజరవ్వగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఐటీఐల్లో ప్రవేశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

వేలంపాటలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ప్యాపిలి: గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాలకు గురువారం కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే రూ. 1,06,000 ఆదాయం పెరిగింది. సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటలను ఈఓఆర్డీ బాలకృష్ణుడు పర్యవేక్షించారు. గతేడాది 12 నెలలకు గాను రూ. 9,80,000 పాటాదారుడు వేలం దక్కించుకున్నాడు. ఈ ఏడాది మూడు నెలల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున 9 నెలలకు మాత్రమే అధికారులు వేలం నిర్వహించారు. పట్టణానికి చెందిన కొంగనపల్లి మధు రూ. 8,41,000కు పాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ కంపెనీ సామాజిక బాధ్యతగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు సూచించారు. గురువారం కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా రెడ్డి నాగరాజు సూచించారు.

పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ నూతన కార్యవర్గం ఎన్నిక



తాలుకాఅధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవరాయుడు

కోవెలకుంట్ల: పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ తాలు కా నూతన కార్యవర్గాన్ని కోవెలకుంట్ల పట్టణంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ యూనియన్ జిల్లా నాయకుడు, సంజామల ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. తాలుకా అధ్యక్షుడిగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంజీవరాయుడు, ఉపాధ్యక్షుడిగా కమాల్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా సోమశేఖర్, జాయింట్ సెక్రటరీగా మధు, డైరెక్టర్ కౌన్సిల్ మెంబర్లుగా జయకుమార్‌రెడ్డి, నాగన్న, కో ఆప్షన్‌మెంబర్లుగా మాబుసాహెబ్, జయసింహారెడ్డిని ఎన్నుకున్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



కొలిమిగుండ్లలో తహసీల్దార్ సునీతబాయిని సన్మానిస్తున్న సిబ్బంది

డోన్ టౌన్/డోన్ రూరల్ : రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటిండెంట్ మధుసూదన్ ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖతో సమాజంలో అవసరాలు, ప్రజలతో ఉన్న అనుబంధాలు, మనిషి పుట్టక నుంచి మరణించిన తరువాత కూడా రెవెన్యూ శాఖలు అందిస్తున్న సేవల గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, సివిల్ సప్లయ్ డీటీ బ్రహ్మయ్య, వీఆర్వోలు రాజు, గోవిందు, రామకృష్ణారెడ్డి, యూనుస్, మనోహర్, సునీల్, మల్లారెడ్డి, మాధవస్వామి, మహానంది, రంగస్వామి, నాయుడు, వీఎస్ఎస్ దాదా, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో రెవెన్యూ ఉద్యోగుల పాత్రే కీలకం

ప్యాపిలి: ప్రజాసేవలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర కీలకమని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగుల సమక్షంలో తహసీల్దార్ కేక్ కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. రెవన్యూ సేవల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో డీటీ మారుతి, సీనియర్‌అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల గురించి వివరించాలి

కొలిమిగుండ్ల: రెవిన్యూ శాఖ అందించే సేవల గురించి ప్రజలకు వివరించాలని తహసీల్దార్ సునీతబాయి ఉద్యోగులకు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను సిబ్బందిని సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం, అడంగల్, ఆర్ఎస్ఆర్, 1బీ, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ భాస్కర్ రెడ్డి, సర్వేయర్ జ్యోతి, వీఆర్వో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను ప్రజలకు చేరవేయాలి

కోవెలకుంట్ల: రెవెన్యూ సేవలను త్వరితగతిన ప్రజలకు చేరవేయాలని తహసీల్దార్ జయప్రకాష్ సూచించారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది, రేషన్‌షాపు డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, ఇమ్రాన్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రత్నకుమారి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంగల్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మాలిక్, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి



డోన్‌లో రెవెన్యూ డే సందర్భంగా మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

బేతంచెర్ల: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్ రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డీటీ దేవనాథ్, ఆర్ఐ శ్రీదేవి, సర్వేయర్ జ్యోస్న, వీఆర్వోల ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో రెవెన్యూ శాఖ వెన్నముక లాంటిదన్నారు. రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధృవీకరణ పత్రాలు జారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీర్వోలు శివరామయ్య, గోవిందప్ప, రఫీ పాల్గొన్నారు.

అవుకు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు కేక్ కట్ చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు మాట్లాడారు. రెవెన్యూ సేవలు తీరును వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమని, అంకితభావంతో సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హరి,విఆర్‌ఓలు చంద్రహాస్ రెడ్డి, పెద్దయ్య, చెన్నప్ప, మల్లికార్జున రెడ్డి, తలార్లు పాల్గొన్నారు.



రెవెన్యూ డే వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, ఉద్యోగులు







ప్యాపిలిలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, కోవెలకుంట్ల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్, బేతంచెర్లలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్

ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన 5 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ గురువారం తెలిపారు. దుర్గాపేట కాలనీకి చెందిన కానాల పుల్లయ్య మిత్రులు నవీన్, శివ కుమార్ బైక్ కోసం హనుమాన్ నగర్‌కు వెళ్లగా హనుమాన్ నగర్ కాలనీకి చెందిన తిమ్మయ్య, ఎర్రమల, బాలకృష్ణ, రాజశేఖర్, పిక్కిలి మద్దిలేటిలు గొడవ పెట్టుకొని కులం పేరుతో దూషించడమే కాకుండా కొట్టిగాయపరిచారు. బాధితుడు కానాల పుల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హనుమంత వాహనంపై బుగ్గ వేంకటేశ్వరుడు



సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. పది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు గురువారం శ్రీదేవి,భూదేవి సమేత బుగ్గ వేంకటేశ్వర స్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాధం శెట్టి శ్రీరాముడు, ఈఓ చంద్రుడు ,అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా ప్రయోజనాలను వివరిస్తున్న తిరుమలయ్య

బనగానపల్లె రూరల్: యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తోందని ప్రిన్సిపాల్ రజిక సత్య ప్రపూర్ణ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ విద్యార్థిని,విద్యార్థులు ప్రతి రోజు యోగా చే యాలని, ఆరోగ్యంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం యోగా మాస్టర్ తిరుమలయ్య ధ్యానం, యోగా ఏ విధంగా చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ రూపదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆనంద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం ప్రాథమిక వ్యసాయ సహకార పరపతి సంఘంలో రుణం, సభ్యత్వం తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ ఘణమద్దిలేటి గురువారం తెలిపారు. పరపతి సంఘంలో సభ్యత్వాలు యథావిధిగా కోనసాగాలంటే రైతులు వారికి సంబంధించిన పొలం, సహకార సంఘం పాసుపుస్తకాలు, ఆధార్, పాన్‌కార్డుల జీరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలను సంఘం సిబ్బందికి అందజేయాలన్నారు. వివరాలు అందజేయని రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు వర్తించవని, పూర్తి వివరాలకు 97039 25072, 99085 93510 నంబర్లు సంప్రదించాలని ఆయన తెలిపారు.

- అలాగే భానుముక్కల సహకార సంఘం సభ్యత్వం కలిగిన రైతులందరూ రెన్యువల్ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ అబ్దుల్ మునాఫ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కంప్యూటరీ కరణలో భాగంగా సభ్యత్వం కలిగిన రైతులందరూ పొలంపాసుపుస్తకం, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫొటోలు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

దేవదాయ శాఖ మంత్రికి సత్కారం

బేతంచెర్ల: దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణ రెడ్డిని మద్దిలేటి నరసింహస్వామి ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఐఏఎస్ సమక్షంలో మంత్రికి మద్దిలేటిస్వామివారి చిత్ర పటాన్ని, శేష వస్త్రాన్ని ఉప కమిషనర్, ఈఓ అందజేసి సత్కరించారు.

కేజీబీవీ స్కూళ్లలో సీట్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): కేజీబీవీ స్కూళ్లలో సీట్లు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు అధికారులను కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సీట్లు రాక తమ చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. ఒక్కోస్కూల్‌లో కనీసం 20సీట్లను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.